# సైరన్

కోటిలింగేశ్వరుని కోవెలగంట శాంతినికేతన్ పి.జి. హాస్టల్‌లో మార్మోగింది. నాగరాజు పెదాలమీద నైట్ క్వీన్ నవ్వింది. పుస్తకం చేజారింది. నైట్‌క్వీన్‌ను చూడాలి గదూ!

గబగబా బయటి కొచ్చేశాడు. కిరణసముదాయాన్ని రెక్కలకింద దాచుకుని మాయమై పోతున్నాడు సూర్యుడు.

ఓహ్ నైట్‌క్వీన్ .... హౌస్వీట్ ఫారిన్ బ్యూటీ... ఎదలో గిలిగింత. ఎంత అందంగా ఉంటుందీ! గచ్చునేల మీది గచ్చకాయల్లా నీలంకళ్లు. తాకితే కందిపోయే నునుపుదేలిన శరీరం. నిన్ననే కాలేజీలో కనబడింది.

"హాయ్ మిస్!" అని పలకరిస్తే.

"హాయ్!" అంటూ చెయ్యూపింది. కలుపుగోలుగా మాట్లాడింది. కళ్లు తిప్పుతూ కబుర్లు చెప్పింది.

వాళ్ళనాన్న పెద్ద ఇంజనీరట. ఐదేళ్ల కాంట్రాక్టు మీద అమెరికా నుండి ఆంధ్రాకొచ్చారట. హైద్రాబాద్‌లో ఉంటున్నారట. కావాలనే సిద్ధిపేట పి.జి. సెంటర్లో సీటు కావాలందట.

"నేను పి.జి ఫైనల్. హాస్టల్ ఉంటున్నా!" తన అడ్రసు చెప్పగానే...

"కోటిలింగాల గుడిముందు వీధిలో నాకో రూం దొరికింది." తన అడ్రస్ చెప్పేసింది.

కళ్ళను కలువల్లా కదిలిస్తూ నవ్వుతూ తనగదికి ఆహ్వానించింది ఆ నవ్వులో నవరత్నాల మెరుపుంది మెడలో కదిలే ఒంటిపేట గొలుసు.. ఒంపుసొంపుల ఎత్తుపల్లాలను కొలుస్తోంది

శాంతినికేతన్ దాటి రోడ్డుమీదికొచ్చాడు

ఆమెరికా గర్ల్స్ చాలా ఫార్వర్డ్ డేటింగంటే పడిచస్తారు ఖుషీగా ఉంటారు. నైట్ క్వీన్ చక్కని గర్ల్ ఫ్రెండ్ ఏమడిగినా సంకోచించదు

"వెల్కం మైడియర్ కింగ్కోబ్రా!" చేతులు చాచి ఆహ్వానించింది.

నైట్క్వీన్ తెల్లని డ్రెస్సులో... అచ్చం నైట్ క్వీన్ పువ్వులాగుంది నాగరాజు నరాల్లో మలయమారుతం గంతేసింది. చదువు సాగనంది నిన్నటి పిలుపు గుర్తుకొచ్చింది...!

"వెరీవెల్! కమాన్ డియార్!" చెయ్యిపట్టి మంచమీద కూచోపెట్టింది. చెవుల రింగులు తళుక్కుమన్నై.

గది నీటుగా ఉంది. మంచం పక్కన గోడకు శ్రీరామ పట్టాభిషేకం కాలెండరుంది.

"తెలుగెప్పుడు నేర్చుకున్నట్టూ...!"

"డిగ్రీలో తెలుగు నా ఆప్షనల్ సబ్జెక్ట్ రాజూ!"

పక్కనే కూచుంది. భుజాలు రాసుకున్నై. నాగరాజు ఒళ్ళు జల్లుమంది. కొంటెకోరిక కొరకొరలాడించింది.

"ఇక్కడి వాతావరణ మెలాగుంది క్వీన్."

భుజమ్మీద చెయ్యేశాడు. సిరిమల్లెలా నవ్వింది. నాగరాజులో ఉత్సాహం ఉరుకులాడింది. ఒంటిరాయి ఆకుపచ్చ ముక్కుపుడక తళుక్కుమంది.

"చీరలో మీరు చాలా అందంగా ఉన్నారు సుమా!" ఆమెవైపు తిరిగాడు

"ఈజిట్!" పైట కొస గుండె నయాగరా జలపాతమైంది అతనివైపు తిరిగింది భుజాలమీంచి పైట జారింది నాగరాజు గొంతు తడారిపోతోంది

"ఈసిల్క్ పైట ఓపట్టాన నిల్వదు" సర్దుకుంది

"వయసలాంటిది ఐనా బాయ్‌ఫ్రెండ్ ముందు పైట లేకుంటేనే బాగుంటుంది గదా!"

నడుమ్మీద చెయ్యేశాడు. అతని చెయ్యిని మర్యాదగా జరిపేసి సర్దుక్కూచుంది

"మీరు ఫైనల్‌గదా.. స్టడీ ఎట్లాసాగుతుంది రాజూ?"

"అబ్బా! స్వర్గానికెళ్లినా సవతిపోరు తప్పదన్నట్లు ఇప్పుడు గూడా స్టడీస్ గురించేనా?"

"మరి. .?" ముడిపడిన కనుబొమ్మల మధ్య ఎర్రని బొట్టు హెచ్చరికలా మెరిసింది.

"లెటజ్ ఎంజాయ్ డియర్!" ఆవిడ నున్నటి భుజాలమీద చేతులేసి పెదాలందుకోబోయాడు.

"మిస్టర్ నాగరాజూ! వాటీజ్ దిస్?" దిగ్గున లేచింది.

"ఇది ప్రకృతి రహస్యం. మనిద్దరం....!" అతని అరచేతులు ఆవిడ బుగ్గల్ని నిమిరాయి.

"వాడ్డూయూ మీన్?"

"ఇటీజ్ వెరీ సింపుల్ డియర్. నేను నీ బాయ్‌ఫ్రెండ్‌ని, నువ్వు నా గర్ల్ ఫ్రెండువి. మనమిప్పుడు స్వర్గానికి షికారుకెల్దాం!"

"నో నో మిస్టర్ నాగరాజూ! ప్లీజ్ సిడౌన్ " వలవంతంగా కూచోబెట్టింది

"ఐ లవ్ ఇండియన్ కల్చర్ అమెరికాలో ఈ హోలీలాండ్ గురించి గొప్పగా చెప్పుకుంటారు ఇక్కడి మనుషులకు కారెక్టర్ అదే శీలం పెట్టని అభరణం గదా . ప్లీజ్ కీపిటప్" బయటకు దారిచూపించింది కళ్ళతో

నాగరాజు వెన్నుపూసలో సైరన్ మోగింది

(అమృత్ కిరణ్ - 1-3-1995)

